ఆంధ్రజ్యోతి
andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.2, కనిష్ఠం 15.6



ఎమ్మెల్యే పీఏకు నోటీసులు

సుభాష్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి వద్ద పీఏగా పనిచేస్తున్నట్లు తెలియడంతో డీఈవో అశోక్ సోమవారం నోటీసులు జారీచేశారు. వెంటనే వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు ప్రజాప్రతినిధులకు పీఏలుగా విధులు నిర్వహించకూడదని సుప్రీం కోర్టు తీర్పు ఉండడంతో శాఖ పరమైన చర్యలు ఉండవచ్చని సమాచారం.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

ధాన్యాగారం..

- ధాన్యం సేకరణలో అగ్రస్థానంలో నిజామాబాద్
- రికార్డు స్థాయిలో ఇప్పటికే 3.47 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు
- 34,328 మంది రైతులకు రూ.549.85 కోట్ల బిల్లుల చెల్లింపు
- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వానాకాలం-2025 సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణలో నిజామాబాద్ జిల్లా రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉందని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి వెల్లడించారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు తదితరులతో కలిసి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం సేకరణ, పత్తి , మొక్కజొన్న కొనుగోళ్లపై సమీక్ష జరిపారు. నిజామాబాద్ జిల్లాలో ఇప్పటికే దాదాపు యాభై శాతం మేర 3.47 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరణ పూర్తి చేయడం పట్ల కలెక్టర్‌ను, సంబంధిత అధికారులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన ధాన్యాన్ని సైతం పూర్తి స్థాయిలో సేకరించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని, లారీలు, హమాలీల కొరత తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని అన్నారు. ప్రస్తుత నవంబర్ నెల ఎంతో కీలకమని, రాబోయే మరో మూడు వారాల పాటు అప్రమత్తంగా వ్యవహరిస్తూ పంట కొనుగోళ్లు సాఫీగా జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగుతోందని మంత్రుల దృష్టికి తెచ్చారు. ధాన్యం సేకరణలో నిజామాబాద్ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. ఈ సీజన్‌లో 8 లక్షల మెట్రిక్ టన్నుల

మిగతా 8వ పేజీలో...

ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

- ప్రతి కేంద్రంలో సరిపడా గన్నీ బ్యాగులు ఉండాలి
- రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

8



యథేచ్ఛగా మల్కాపూర్ (ఏ) గుట్టను తవ్వేసిన అక్రమార్కులు

గుట్ట నక్కలు..

జిల్లాలో ఇష్టానుసారంగా మట్టి అక్రమ తవ్వకాలు

- అనుమతి 20 ట్రిప్పులకు, తీసేది 150 ట్రిప్పులు
- ఐదు నెలల్లోనే భారీ కొండ చదును
- ప్రతీ రోజు వందల ట్రిప్పుల మట్టి తరలింపు
- నామమాత్రపు అనుమతితో సహజవనరులకు ఎసరు
- సర్కారు భూమిలో యథేచ్ఛగా తవ్వకాలు
- అభివృద్ధి పనుల పేరుతో కరెన్సీ దందా
- జిల్లా కేంద్రానికి సమీపంలో గుట్టలకు ఎసరు
- పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్ అధికారులు

అక్రమార్కుల ధన దాహానికి గుట్టలు కనుమరుగవుతున్నాయి. భూగర్భంలో గునపాలు దించుతూ భారీ యంత్రాలతో మట్టిని తవ్వుతూ సహజ సంపదకు కీడు చేస్తున్నారు. జిల్లా కేంద్రానికి అతి సమీపంలో మొరం దందా సాగుతున్నా.. నిత్యం కళ్ల ముందే మట్టి వాహనాలు వెళుతున్నా యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోంది. అధికార పార్టీకి చెందిన ఓ బడా నేత మట్టి తవ్వకాలకు అభయం ఇచ్చినట్లు సమాచారం. స్థానిక నాయకులు సైతం అభివృద్ధి పనుల పేరిట అనుమతులున్నాయని బుకాయిస్తూ గుట్టలను నమిలేస్తున్నారు. నామమాత్రంగా అనుమతి తీసుకుని వందల ట్రిపుల మట్టిని తరలిస్తున్నారు. అక్రమార్జనకు అలవాటుపడిన కొందరు అధికారుల తీరుతో ఆ దందా అడ్డూ అదుపూ లేకుండా సాగుతోంది.



నిజామాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా కేంద్రానికి 10కి.మీ. దూరంలో ఉన్న రూరల్ మండలం మల్కాపూర్(ఏ)లో 300 ఎకరాలపైనే ఉన్న ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా మొరం తవ్వుతున్నారు. సర్వే నెం.339లో అనంతయ్య క్రషర్ పక్కన గల గుట్టను ఐదు నెలల్లో నామరూపాలు లేకుండా చేశారు. అక్రమంగా మొరం తవ్వి సొమ్ము చేసుకున్నారు. భారీ స్థాయిలో జరిగిన తవ్వకాల వల్ల ఆరు నెలల క్రితం ఉన్న గుట్ట ఇప్పుడు కానరావడం లేదు. ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా స్థానికంగా మొరం దందా నిర్వహించే వ్యక్తి స్థానిక ప్రజాప్రతినిధి అండదండతో మొరం తవ్వకాలు జరిపినట్లు విమర్శలు ఉన్నాయి.

పెద్దల అండతో దందా..

ప్రభుత్వ భూమిలో మొరం అక్రమ తవ్వకాలపై అటు గనులశాఖ, ఇటు రెవెన్యూశాఖ నోరు మెదపకపోవడంతో స్థానిక ప్రజాప్రతినిధుల అండఉన్నట్లు స్పష్టమవుతోంది. ఇటీవల బీజేపీ జిల్లా అధ్యక్షుడు మొరం తవ్వకాలు జరుగుతున్న గుట్టను పరిశీలించి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో మూడు రోజులుగా తవ్వకాలను నిలిపివేశారు.

బడా భాగస్వాములు..

మొరం తవ్వకాలు నిర్వహిస్తున్న వ్యక్తి నేరుగా తనకు స్థానిక ప్రజాప్రతినిధుల అండతో పాటు వారి సహాయకులకు ఈ తవ్వకాలలో

మిగతా 8వ పేజీలో...



ఆర్మూర్ బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

జిల్లాలో హై అలర్ట్

- పోలీసుల తనిఖీలు

ఆర్మూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన కారు బాంబు పేలుడు నేపథ్యంలో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. సోమవారం రాత్రి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వాహనాలతో పాటు అనుమానాస్పద వ్యక్తులను తనిఖీలు చేశారు. నిజామాబాద్ నగరంతో పాటు ఆర్మూర్ పట్టణంలో పలు ప్రాంతాల్లో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎక్కడ కూడా ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తనిఖీలు చేశారు. నిజామాబాద్ బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో, ఆర్మూర్ బస్టాండ్ ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేశారు.

ఇందూరు నుంచే అందెశ్రీ సాహితీ యాత్ర

- జిల్లాతో ప్రత్యేక అనుబంధం
- తాపీ మేస్త్రీతో ప్రారంభమైన జీవితం
- ఆశు కవిత్వం చెప్పడంలో ప్రత్యేక గుర్తింపు

8

భళా.. పూర్వ విద్యార్థి

7

- 59 మంది పరీక్ష ఫీజు చెల్లించిన నారాయణ



ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో నడవాలి

- దైవభక్తితో మానసిక ప్రశాంతత
- రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి
- ఘనంగా అడ్కేస్ లింగమయ్య ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన

7

13న సుదర్శన్‌రెడ్డికి సన్మానం

సుభాష్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రభుత్వ ముఖ్య సలహాదారుడిగా పదవి బాధ్యతలు చేపట్టిన బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి ఈనెల 13న ఘనసన్మానం నిర్వహిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో మధ్యాహ్నం 3గంటలకు సన్మాన సభ జరుగుతుందని అన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే సన్మాన సభకు భారీగా కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలని ఆయన కోరారు.



వరి కోత మిషన్ల ధరల దోపిడీ

- హార్వెస్టర్ల నిర్వాహకుల తీరుతో రైతుల విలవిల
- మిషన్‌ల కొరతతో ఒక్కసారిగా డిమాండ్
- గంటకు రూ.2600 రేటు నుంచి రూ.3500 పెంపు
- ప్రభుత్వ జోక్యం కోరుతున్న బాధిత రైతులు
- తుపాన్ ప్రభావంతో వర్షాలు, వరదలతో పంటలు ముంపు

రెంజల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు ప్రకృతి దెబ్బకు తట్టుకోలేక విలవిలాడుతున్నారు. గత నెల తుపాన్ ప్రభావంతో మండలంలోని నీలా, తాడ్‌బిలోలి, కందకుర్తి, బోర్గాం గ్రామాల్లో కురిసిన భారీ వర్షాలకు వేల ఎకరాల పంటలు నీట మునిగాయి. ఇప్పటికే నష్టాలతో కుంగిపోయిన రైతులు ఇప్పుడు మరో ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. పొలాలు ఇంకా తడిగా ఉండటంతో వరి కోత మిషన్‌లు పని చేయలేని పరిస్థితి ఏర్పడింది. మిషన్‌లు అందుబాటులో లేకపోవడంతో డిమాండ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. ప్రతి గ్రామంలో వరికోత కోసం రైతులు రోజుల తరబడి ఎదురు చూస్తున్నారు. కొన్ని పొలాల్లో వరి నేలకొరగగా, కోత ఆలస్యం అవడంతో దిగుబడి నష్టం మరింత పెరుగుతోంది.

రేట్లు పెంచిన మిషన్‌దారులు..

ముందుగా గంటకు రూ.2600 ఉన్న కోత మిషన్ చార్జీలు ఇప్పుడు రూ.3000 నుంచి రూ.3500కి ఎగబాకాయి. మిషన్‌ల కొరతను అదనపు ఆదాయంగా మలచుకున్న మిషన్‌దారులు రైతులపై భారాన్ని మోపుతున్నారు. పలువురు రైతులు వర్షాల దెబ్బతోనే కుంగిపోయి

మిగతా 8వ పేజీలో...

బదిలీ అయిన న్యాయాధికారులకు ఘనంగా వీడ్కోలు

8

ఎకరాకు రూ.50వేల పరిహారం అందించాలి

- 'ప్రజావాణి'లో కలెక్టర్‌ను కోరిన నవీపేట రైతులు



తీర్పు ఇచ్చినా.. తీరు మారదా?

- అక్రమ నియామక సిబ్బందిని కాపాడుతున్నది ఎవరు ?
- టీయూలో కోర్టు ఉత్తర్వులపై గందరగోళం
- విద్యార్థి సంఘాలను రెచ్చగొడుతూ లబ్ధిపొందాలని అక్రమార్కుల ప్రయత్నం
- జిల్లా పెద్దల దృష్టికి వర్సిటీ సమస్య
- ఇన్‌చార్జి మంత్రి సమక్షంలో చర్చించే అవకాశం

నిజామాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ యూనివర్సిటీలో 2012లో జరిగిన అక్రమ నియామకాలపై ఇటీవల కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేసే విషయంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. అసలు కోర్టు ఉత్తర్వులు వర్సిటీ ఉన్నతాధికారులకు చేరాయా లేదా? అనేది స్పష్టత లేదు. ఇంకా అక్రమంగా నియామకాలు పొందిన వారంతా విధులకు హాజరవుతున్నారు. వీరిని కాపాడే బాధ్యతను కొంతమంది వర్సిటీ పెద్దలు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

విద్యార్థి సంఘాలతో ఆటలు...

గతంలో రిజిస్ట్రార్‌గా పనిచేసిన ఓ వ్యక్తి విద్యార్థి సంఘాలను విభజించి తమకు అనుకూలంగా మార్చుకునేలా ప్రయత్నాలు చేయడం విమర్శలకు తావిస్తుంది. సోమవారం కొన్ని విద్యార్థి సంఘాలు 2012 అక్రమ నియామకాలను వెంటనే రద్దుచేసి నూతన నోటిఫికేషన్ ఇచ్చి కొత్త నియామకాలు చేపట్టాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చి యూనివర్సిటీలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. కానీ ఎన్‌ఎస్‌యూఐ విద్యార్థి సంఘం పేరుతో కొంతమంది 2012 నియామకాలను సమర్థిస్తూ ఆందోళన నిర్వహించడం వెనక యూనివర్సిటీకి చెందిన కొంతమంది ప్రోద్బలం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో విద్యార్థి సంఘ నాయకుడిగా పనిచేసి ప్రస్తుతం అక్కడే పార్ట్‌టైం అధ్యాపకుడిగా పనిచేస్తున్న వ్యక్తితో పాటు యూనివర్సిటీలో గతంలో రిజిస్ట్రార్‌గా పనిచేసిన వ్యక్తి ఆ ఆందోళన వెనక ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఏకంగా ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శే యూనివర్సిటీలో ఆందోళన చేసిన విద్యార్థులకు, తమకు ఎలాంటి సంబంధంలేదని ప్రకటించడం ఈ వ్యవహారంలో యూనివర్సిటీ పెద్దలు 2012 అక్రమ నియామకాలు పొందిన వారిని కాపాడేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. అక్టోబరు 31న నియామకాలను రద్దుచేస్తూ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఇప్పటికీ ఎందుకు అమలు చేయడంలేదో యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గాని, రిజిస్ట్రార్‌గాని నోరు మెదపకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

జిల్లా ప్రజాప్రతినిధుల దృష్టికి..

నాలుగైదు రోజులుగా తెలంగాణ విశ్వవిద్యాలయంలో అక్రమ నియామకాలపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలు జిల్లా ప్రజాప్రతినిధుల వద్దకు చేరాయి. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నా జిల్లాకు చెందిన

మిగతా 8వ పేజీలో...

అక్రమాల ఊబిలో తెలంగాణ వర్సిటీ

- సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి
- ఏఐపీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బోడ అనిల్

8

ప్రజా సేవయే ప్రధాన ధ్యేయం

- జిల్లా ప్రధాన న్యాయాధికారి జీవీఎన్ భరత లక్ష్మి



దివ్యాంగుడికి వీల్ చైర్‌ను అందజేస్తున్న న్యాయసేవ సంస్థ

నిజామాబాద్ లీగల్, నవంబరు 10: (ఆంధ్రజ్యోతి): ప్రజలకు న్యాయసేవలు అందించడమే ప్రధాన ధ్యేయంగా న్యాయసేవల చట్టం రూపకల్పన జరిగిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ జీవీఎన్ భరత లక్ష్మి తెలిపారు. న్యాయసేవల చట్టం దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవ సదన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ప్రధానోపాన్యాసం చేశారు. గ్రామ అభివృద్ధి కమిటీల అకృత్యాలను అడ్డుకట్ట వేశామన్నారు. అసమానతలను, వెలివేతలను ఎదుర్కొంటున్న వారికి అండగా న్యాయసేవ సంస్థ చట్ట రక్షణను కల్పిస్తున్నదని అన్నారు. వాసవి జనత ఫౌండేషన్ సహకారంతో వీల్ చైర్‌ను దివ్యాంగుడు భార్గవ్‌కు భరత లక్ష్మి అందజేశారు. అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్ మాట్లాడుతూ.. న్యాయసేవల చట్టం ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. జిల్లా న్యాయసేవ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి అదనపు జిల్లా జడ్జిగా పదోన్నతి పొందిన ఉదయ్ భాస్కర్‌రావు మాట్లాడుతూ.. సంస్థ గొప్ప లక్ష్యం ఉచిత న్యాయ సేవలేనని తెలిపారు. కార్యక్రమానికి జూనియర్ సివిల్ జడ్జి కుష్బూ ఉపాధ్యాయ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిళ్ల సాయ రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జిలు గోపికృష్ణ, హరికుమార్, శ్రీనివాస్ రావు, బార్ ప్రధాన కార్యదర్శి మాణిక్ రాజు, వాసవి జనతా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

లక్కోర మాజీ సర్పంచ్‌పై కత్తితో దాడి

వేల్పూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): లక్కోర మాజీ సర్పంచ్ వంశీ కృష్ణపై ఆదివారం రాత్రి అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కత్తితో తీవ్రంగా గాయపర్చినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. మాజీ సర్పంచ్ వంశీ కృష్ణ తన మామ ఇంటికి వెళ్తున్న సందర్భంలో రామాలయం సమీపంలో ఆయనపై నాగం రాజేష్, నాగం నర్సయ్యలు కత్తితో దాడి చేయడంతో కడుపుపై భాగంలో, చేతులకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రున్ని ఆర్మూర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. వంశీకృష్ణ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు కార్లు ఢీ.. ఇద్దరికి గాయాలు

వేల్పూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కోర గ్రామ సమీపంలో 63వ జాతీయ రహదారిపై సోమవారం ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. కరీంనగర్‌కు చెందిన మోదిగంటి రాజారెడ్డి తన భార్య కలిసి ఆర్మూర్ నుంచి కారులో కరీంనగర్ వెళ్తున్న క్రమంలో లక్కోర గ్రామ సమీపంలో మోర్తాడ్ వైపు నుంచి ఆర్మూర్‌కు వస్తున్న కారు ఢీ కొన్నాయి. మోర్తాడ్ నుండి ఆర్మూర్ వైపుకు వస్తున్న కారు డ్రైవర్ గడ్డం యాదగిరి అనే వ్యక్తి అతీ వేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటు కరీంనగర్ వెళ్తున్న కారుకు ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో రాజారెడ్డికి, ఆయన భార్యకు తీవ్ర గాయాలు కాగా ఆమెను ఆర్మూర్ ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించినట్లు ఎస్సై తెలిపారు

పేకాట రాయుళ్ల అరెస్టు

ఆర్మూర్ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. అందిన సమచారం మేరకు ఆదివారం రాత్రి మామిడిపల్లి లోని ఒక ఆర్డర్ మెస్‌లో పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.14460, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని ఆర్డర్ మెస్ యజమానితో పాటు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

కాపర్ వైర్ చోరీ

పెద్దకొడపగల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెద్ద కొడపగల్ శివారుతో పాటు మండలంలోని శివ్వాపూర్ గ్రామ శివారులో దుండగులు విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లను ధ్వంసం చేసి రాగి వైర్‌ను ఎత్తుకెల్లినట్లు రైతులు తెలిపారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు పెద్ద కొడప్‌గల్ శివారుతో పాటు, శివ్వాపూర్ శివారులో గల విద్యుత్ ట్రాన్స్ పార్మర్లను కింద పడవేసి రాగి వైర్‌ను ఎత్తు కెళ్లారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

కామారెడ్డిటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపినటువంటి 24 మందిని పోలీసులు సోమవారం స్థానిక కోర్టులో హాజరుపర్చారు. అందులో ఇద్దరు వ్యక్తులు బాలకృష్ణ, తిరుపతిరెడ్డిలకు ఒక్కరోజు చొప్పున జైలు శిక్ష, రూ.1000ల చొప్పున జరిమనా విధిస్తూ జడ్జ్ తీర్పునిచ్చారు. 22 మందికి రూ.1000 చొప్పున జరిమాన విధించినట్లు సీఐ నరహరి తెలిపారు.

కేసు నమోదు

తాడ్వాయి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం నిర్వహించిన డ్రంకన్‌డ్రైవ్‌లో ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. బాల్‌రెడ్డి, ప్రవీణ్‌పై కేసు నమోదు చేయగా ఒక రోజు జైలు శిక్ష వెయ్యి రూపాయల జరిమానాను రెండవ తరగతి జ్యూడిషియల్ సి.చంద్రశేఖర్ జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడుపితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ఇద్దరి రిమాండ్

ఆర్మూర్ టౌన్ , నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రజా పంపిణీ బియ్యం అక్రమ రవాణా చేస్తూ పట్టుకున్న కేసులో ఇద్దరిని రిమాండ్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. ఇటీవల అంగడి బజార్ వద్ద ప్రజా పంపిణీ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న రంజిత్ కుమార్ వేల్పూర్‌కు చెందిన రేషన్ డీలర్ మేకల పాపన్నలను అరెస్టు చేసి సోమవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

కమ్మర్‌పల్లి వద్ద ఇసుక ట్రాక్టర్ బోల్తా


కమ్మర్‌పల్లి బైపాస్ రోడ్డు వద్ద బోల్తాపడిన ఇసుక ట్రాక్టర్

కమ్మర్‌పల్లి, నవంబరు 10: (ఆంధ్రజ్యోతి):భీమ్‌గల్ వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ కమ్మర్‌పల్లి బైపాస్ రోడ్డు వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఆ సమయంలో అక్కడే వడ్లు ఆరబోస్తున్న ఇద్దరు మహిళలతో పాటు ట్రాక్టర్ డ్రైవర్ పల్లెపు సాయిలు తృటిలో పత్పించుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. అక్రమంగా ఆసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను హసాకొత్తూర్ గ్రామానికి చెందిన వీఆర్ఏ వెంబడించి ట్రాక్టర్‌ను పోలీసులకు అప్పగించే ప్రయత్నంలో తప్పించుకునేందుకు యత్నించిన డ్రైవర్ కమ్మర్‌పల్లి బైపాస్‌రోడ్డు వద్దగల టెలిఫోన్ బీడీ కంపెనీ వద్ద అతివేగంగా ట్రాక్టర్‌ను మలపడంతో ట్రాలీ, ఇంజన్ బోల్తాపడింది ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాకపోగా అక్కడే వడ్లు ఆరబోస్తున్న ఇద్దరు మహిళలకు తృటిలో ప్రమాదం తప్పింది. సంఘటన స్థలాన్ని కమ్మర్‌పల్లి ఎస్సై అనీల్‌రెడ్డి, ఆర్ఐ శరత్ పరిశీలించారు. క్రేన్ సాయంతో ట్రాక్టర్‌ను ట్రాలీని స్టేషన్‌కు తరలించారు.

గోదావరిలో మునిగి జాలరి మృతి


అక్షయ్(ఫైల్)

నవీపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌కు చెందిన ఆలూరు అక్షయ్(18)అనే జాలరి ప్రమాదవశాత్తు సోమవారం గోదావరిలో మునిగి మృతి చెందాడని ఎస్ఐ తిరుపతి తెలిపారు. రోజు మాదిరిగానే చేపలు పట్టడానికి గోదావరికి వెళ్లిన అక్షయ్ మధ్యాహ్నం సమయానికి కూడా అతడు ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు గోదావరి వద్దకు వెళ్లి చూడగా అతని దుస్తులు, చెప్పులు కనిపించాయి. సాయంత్రం అక్షయ్ మృతదేహం నీటిలో తేలిందని ఎస్సై తెలిపారు. కాళ్లకు చేపల వల చుట్టుకోవడంతో ప్రమాదవశాత్తు అతడు మృతిచెంది ఉంటాడని భావిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి తల్లి సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జాతీయ రహదారిపై ట్యాంకర్ బోల్తా..

మెండోర, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుస్సాపూర్ 44వ జాతీయ రహదారిపై ఆదివారం ఇథనాల్ ఆయిల్ ట్యాంకర్ బోల్తా పడిన విషయం తెలిసిందే. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఇథనాల్ ఆయిల్ ట్యాంకర్ బుస్సాపూర్ వద్ద ట్యాంకర్ ముందు ఉన్న కారు యూటర్న్ తీసుకునే సమయంలో కారును తప్పించ బోయి ఆయిల్ ట్యాంకర్ బోల్తాపడింది. దీతో స్థానిక ప్రజలు, పోలీస్‌లు భయాందోళనకు గురయ్యారు. ఆయిల్ ట్యాంకర్ నుంచి గ్యాస్ లీక్ అయితే పెద్ద ప్రమాదం జరిగేది. ట్యాంకర్ లో 40 వేల లీటర్ల ఇథనాల్ ఆయిల్ ఉంది. బోల్తా పడ్డ ట్యాంకర్ క్రేన్‌ల సహాయంతో రోడ్డు నుండి తీసివేయాలని చూసిన కానీ ఆదివారం సాధ్యం కాలేదు. సోమవారం ఉదయం హైదరాబాద్ నుండి బారీ క్రేన్ వచ్చి ట్యాంకర్ ను తీసే సమయంలో పోలీసులు అప్రమత్తమై ఎక్కడి వాహనాలు అక్కడే కిలో మీటర్ దూరంలో ఆపివేశారు. క్రేన్ లేపుతున్న సమయంలో ఫైర్ సిబ్బంది వాటర్ కొట్టుతూ క్రేన్‌తో ట్యాంకర్ ను పక్కకు లేపారు. ట్యాంకర్ లేపుతున్న సమయంలో ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా ఉండేందుకు ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి, ఎస్సైలు సహాసిని, రజనీకాంత్, పోలీస్ సిబ్బంది ట్రాఫిక్ ను నియంత్రించి చర్యలు తీసుకోవడంతో ప్రజలు, పోలీస్‌లు ఊపిరి పీల్చుకున్నారు.

ఊరికి ఉపకారి



- విద్యాదాత దయానందుడు
- సొంతూరిపై మమకారం
- సుమారు 100 పాఠశాలలకు డెస్క్ బెంచీల వితరణ

ఆర్మూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో విద్యార్థులకు, పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పించాలన్న లక్ష్యంతో మౌలిక వసతుల కల్పనకు సొంతంగా కృషి చేస్తున్నారు విద్యాదాత ఏనుగు దయానంద్ రెడ్డి. జిల్లాలోని సుమారు 100 పాఠశాలలకు డెస్క్, బెంచీలు, వివిధ పాఠశాలలకు సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్లు, క్రీడా దుస్తువులు, క్రీడా పరికరాలు అందజేస్తున్నారు. పాఠశాలల్లో సమస్యలుండి విద్యార్థులకు అసౌకర్యంగా ఉందని తెలిసిన వెంటనే సమస్య పరిష్కారానికి చొరవ చూపుతున్నారు. దాత దయానంద్‌రెడ్డి ఇప్పటి వరకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని వంద ప్రభుత్వ పాఠశాలలకు 3758 డెస్క్ బెంచీలు, క్రీడా సామగ్రి, క్రీడా దుస్తులను వితరణ చేశారు. వివిధ పాఠశాలలకు 54 సైన్స్ ల్యాబులు, 74 కంప్యూటర్లు సమకూర్చా రు. ఇటీవల బాల్కొండ మండల కేంద్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో సుమారు 40 పాఠశాలల విద్యార్థులకు రూ.20 లక్షల విలువ చేసే క్రీడా పరికరాలు, క్రీడా దుస్తులను అందజేశారు.


దాత అందజేసిన డెస్క్, బెంచీలు

సొంతూరిపై మమకారం..

దాత దయానంద్‌రెడ్డికి తన సొంతూరు చిట్టాపూర్ అంటే ఎనలేని మమకారం. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థుల విద్యకు ఆర్థికంగా చేయూత నందిస్తున్నారు. చిట్టాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను దత్తత తీసుకుని ప్రతీ విద్యార్థి పాఠశాలకు వెళ్లేలా ప్రోత్సహిస్తున్నారు. పిల్లలను పాఠశాలకు తీసుకువెళ్లడానికి ఆటోలను సమకూర్చారు. ఆటోలకు నెలకు రూ.18వేల చొప్పున చెల్లిస్తున్నారు.

రూ. 2 కోట్ల 50 లక్షల మిషిన్ విరాళం

తాను వ్యాపారం ప్రారంభించిన సమయంలో మోల్డింగ్‌కు హైదరాబాద్‌లో ఒకే మిషిన్ ఉండేది. గంటల తర బడి నిలబడి పనిచేసే వారు. ఇప్పటి ఇంజనీరింగ్ విద్యార్థు లకు అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని వారి లోని నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన టి వర్క్స్‌కు 2 కోట్ల 50 లక్షలు విలువ చేసే మిషన్‌ను అందజేశారు. ఆయన సేవాతత్వం సమా జానికి ఆదర్శంగా నిలుస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన ఏనుగు దయానంద్‌రెడ్డి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివారు. కష్టపడి పైకి వచ్చి న ఆయన ఎంటెక్ పూర్తి చేసి మోల్డింగ్ వ్యాపారాన్ని ప్రారంభించి ఉన్నత స్థానానికి ఎదిగారు. ఎంత ఎదిగిన ఒదిగి ఉండే తత్వంతో తాను చదువుకున్న పాఠశాలకు, విద్యార్థులకు సౌకర్యాలను కల్పిస్తున్నారు. సేవే మానవత ధర్మం అనే నినాదాన్ని నిజం చేస్తూ జీవితంలో ఆచారిస్తు వేలాది మంది విద్యార్థులకు ప్రేరణ ఇస్తు బాసటగా నిలుస్తున్నారు. విద్యాదాత, క్రీడా దాత దయానంద్ రెడ్డి.



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్

బోధన్ ఐటీఐలో అప్రెంటిస్ మేళా

బోధన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఐటీఐ మైనారిటీ కళాశాల నందు సోమవారం అప్రెంటీస్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శాంతరాం మాట్లాడుతూ కళాశాలలో నిర్వహించిన మేళాలో ఎల్‌ఎల్‌టీ బెంగళూరు, వరుణ్ మోటార్స్ నిజామాబాద్, రెండు ప్రముఖ కంపెనీలు పాల్గొని వివిధ ట్రేడ్‌లలోని 36మంది ట్రైనీలను సెలక్ట్ చేయడం జరిగిందన్నారు. మెకానికల్ డీగోల్, ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, మోటార్ మెకానిక్, వెహికిల్, కోపాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంపిక చేశారన్నారు. జాబ్‌మేళాలలో ఐటీఐ కళాశాల విద్యార్థులు, అధ్యాపక బృందంచ కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకంపై అవగాహన

భీమ్‌గల్ , నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఫిషరీస్ విద్యార్థులకు చేప పిల్లల పెంపకంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ జైపాల్ రెడ్డి ఆదేశానుసారం ఆన్ జాబ్ ట్రైనింగ్ లో భాగంగా సోమవారం పట్టణ కేంద్రంలో గల చేపల చెరువు వద్ద ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాస్ క్షేత్రస్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చేపల పెరుగుదల, వాటికి అందించాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు.

వీరశైవ లింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడిగా దినేష్ పాటిల్


వీరశైవ లింగాయత్ రాష్ట్ర కమిటీ ఎన్నిక దృశ్యం

బోధన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షులుగా బోధన్ పట్టణానికి చెందిన దినేష్ పాటిల్ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడలో రాష్ట్ర వీరశైవ లింగాయత్ బలిజ సంఘం కేంద్ర కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎ న్నుకున్నారు. అద్యక్షుడిగా బోధన్ పట్టణానికి చెందిన జీ.దినేష్ పాటిల్ రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బోధన్‌కు దినేష్ పాటిల్ హైకోర్టు న్యాయవాది, సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ సభ్యుడు కాడవం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల బోధన్, మండల వీరశైవ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ అభివృద్ధి యువత ప్రోత్సాహం కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

నల్లూర్‌లో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

ముప్కాల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లూర్ గ్రామంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సివిల్ సప్లై కార్పోరేషన్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించినట్లు ఏపీఎం హిమబాల తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ విఘ్నేష్, సీసీ విక్రమ్‌రెడ్డి, బరకం గంగాధర్, పూర్మిశెట్టి రమణ పాల్గొన్నారు.

షీ టీమ్‌పై విద్యార్థులకు అవగాహన

రెంజల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి చట్టాలపైన అవగాహన అవసరమని షీటీమ్ బోధన్ డివిజన్ ఇన్‌చార్జి ఆశన్న అన్నారు. సోమవారం మండలంలోని దూపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు షీటీమ్ బృందం ఆధ్వర్యంలో చట్టాలపైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవరెడ్డి, పీఆర్‌టీయూ అధ్యక్షులు సోమలింగం గౌడ్, ఉపాధ్యాయులు వెంకట లక్ష్మి, కృష్ణ, ప్రభాకర్, రాజేశ్వర్, రాములు పాల్గొన్నారు.

వేల్పూర్: ఎవరైనా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన, వేధించిన ఈవ్ టీజింగ్ చేసిన షీ టీంకు ఫిర్యాదు చేయాలని సబ్ డివిజన్ షీటీం పోలీస్‌లు విఘ్నేష్, సుమతి తెలిపారు. వేల్పూర్ మండలం పడిగెల్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు సైబర్ క్రైం, మహిళలపై ఈవ్ టీజింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాంచందర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ

బోధన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మినార్‌పల్లి గ్రామంలో సోమవారం అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రత్యేక సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు భూమిపూజ నిర్వహించామన్నారు.

ఘనంగా శివాలయ వార్షికోత్సవ వేడుకలు

నవీపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివపంచాయతన శివాలయంలో సోమవారం ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, గణపతిపూజ, పుణ్యవచనం, వాస్తుపూజ, క్షేత్రపాల నవగ్రహ మంటప పూజ, హోమం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మైనారిటీ గురుకుల పాఠశాల తనిఖీ

కోటగిరి,నవంబరు10(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలను సోమవారం ఎంపీడీవో విష్ణు తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుకై లబ్ధిదారుల జాబితాతో పాటు వారి స్థితిగతులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో క్యాకప్ప తదితరులున్నారు.

ఉపాధి కల్పనలో వంద శాతం లక్ష్యం పూర్తి

ఏర్గట్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి కల్పించే ఎంటర్ ప్రైజెస్ ఏర్పాటులో వంద శాతం లక్ష్యాన్ని జిల్లాలోనే మొదటి స్థానం పూర్తి చేసుకున్నందుకు మండల సమాఖ్యలో కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఐకేపీ ఏపీఎం కుంట గంగాధర్ మాట్లాడుతూ 2025-2026 ఆర్థిక సంవత్సరపు బ్యాంకు లింకేజి రుణాల పంపిణీ రూ. 19.75 కోట్ల లక్ష్యానికి గాను రూ. 19.84 కోట్లు ఇదివరకే పంపిణీ చేసి వంద శాతం పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎం కిరణ్ కుమార్, సిసి రవి కుమార్, సుప్రియ, వివోఏలు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఎడపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం మినీ వ్యానులో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్సు అధికారులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎడపల్లి ఎస్సై రమ తెలిపారు. ఎడపల్లి మండలం గుండా దాదాపు 15 కింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో విజిలెన్సు అధికారులు దాడిచేసి బియ్యం తరలిస్తున్న వ్యానుతో సహా పీడీఎస్ బియ్యాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బియ్యాన్ని తూకం వేసి సివిల్ సప్లై అధికారులకు అప్పగిస్తామని తెలిపారు.

మెండోర: బుస్సాపూర్ గ్రామ శివారులో పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై సుహాసిని తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం పక్క సమాచారంలో అక్రమంగా తరలిస్తున్న బాల్కొండకు చెందిన వినీష్, నిర్మల్‌కు చెందిన సూఫిన్‌లు తరలిస్తున్న 46 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకుని నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శోభాయమానంగా కార్తీక దీపాలు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని శివాలయాల్లో సోమవారం కార్తీక దీపోత్సవం శోభాయమానంగా సాగింది. జిల్లా వ్యాప్తంగా శివాలయాల్లో సాయంత్రం ఆకాశ దీపాన్ని వెలిగించగానే ఆలయ ప్రాంగణంలో వివిధ రూపాల్లో పేర్చిన దీపాలను భక్తులు వెలిగించారు. పలు ప్రాంతాల్లో గంగా హారతి సమర్పించుకోగా మరికొన్ని ప్రాంతాల్లో కోనేరుకు కార్తీక హారతిని ఇచ్చారు. శివుని రోజు కావడంతో ఆలయాల్లో ఉదయం నుండి సాయంత్రం వరకు అభిషేకాలు సాగాయి. పలు ప్రాంతాల్లో నిర్వహించిన అన్నదానంలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వర ఆలయంలో ఉదయం నుండి సాయంత్రం వరకు అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ప్రదోశకాల అభిషేకం నిర్వహించి శాస్త్రోక్తంగా ఆకాశ దీపాన్ని వెలిగించారు. శివపార్వతుల విగ్రహాలను కోనేరు వరకు ఊరేగింపు నిర్వహించి అర్చకులు కోనేరు హారతిని ఇచ్చారు.

ఇసుక రవాణాను అడ్డుకున్న గ్రామస్థులు

- అనుమతి పేరిట అక్రమాలకు పాల్పడుతున్నారని గ్రామస్థుల ఆగ్రహం


పోతంగల్‌లో ఇసుక టిప్పర్‌లను అడ్డుకున్న దృశ్యం

కోటగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పేరుతో ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని పోతంగల్ గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోతంగల్ మండల కేంద్రంలో సోమవారం ఇసుక టిప్పర్లను గ్రామస్థులు అడ్డుకున్నారు. మంజీర నదిలో కొడిచర్ల గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఇసుక మేటలు వేశాయి. సాగుభూమిలో ఇసుక మేటలు వేయడంతో తొలగించేందుకు జిల్లా అధికారులు అనుమతులు ఇచ్చారు. ఈ మేరకు ఇసుక తవ్వకాలు చేపట్టారు. రెవెన్యూ అధికారులు వేబిల్లులు జారీ చేశారు. పరిమితికి మించి ఇసుకను తరలించడంతో రహదారులు దెబ్బతింటున్నాయని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ వైపు భారీ వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని రోడ్లపై వడ్లు ఆరబెట్టుకుంటే ఇసుక లారీలను అనుమతించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఒకే వే బిల్లుపై అదనపు ట్రిప్పులు తరలిస్తున్నారని రైతులు, గ్రామస్థులు ఆరోపించారు. ఇసుక రవాణాను నిలిపివేయాలంటూ గ్రామస్థులు పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ గంగాధర్, ఎస్ఐ సునీల్ సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. ఇసుక అక్రమ రవాణాను నిలిపివేయాలంటూ పట్టుబడ్డారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. సుమారు రెండు గంటల పాటు రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది.

బోధన్‌లో రైతుల వన భోజనాలు

బోధన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బోధన్‌లోని బెల్లాల్ శివారు రైతులు సోమవారం పసుపు వాగు శివారులో సహపంక్తి భోజనాలు నిర్వహించారు. బెల్లాల్ కట్టపై వెలిసిన పాపా నాగమ్మ ఆలయానికి రైతులు బోనాలతో వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి ఒడిబియ్యం నింపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంటలు బాగా పండాలని, రైతులను అమ్మవారు చల్లగా చూడాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పసుపు వాగు శివారులో వన భోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు గుంజరి పోశెట్టి, ఏశాల సురేందర్, బోదు భూమారెడ్డి, ఉప్పరి శంకర్, రవి తదితరులున్నారు.

శతాధిక వృద్ధుడు గుర్రం తాత కన్నుమూత


ధర్మానాయక్

కమ్మర్‌పల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాసముందర్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం గుడిలింగాపూర్ గ్రామ వ్యవస్థాపకుడు శతాధిక వృద్ధుడు గుర్రం తాత మలావత్ ధర్మానాయక్ (110) సోమవారం మధ్యాహ్నం కన్నుమూశారు. ధర్మానాయక్‌కు ముగ్గురు కుమారులు నరేందర్ నాయక్, రాంజినాయక్, శంకర్ ప్రసాద్ నాయక్, ముగ్గురు కూతుళ్లు మేని, రేణి, అంబి ఉన్నారు. నాటి నుంచి నేటివరకు ధర్మానాయక్ (గుడిలింగాపూర్ గుర్రంతాత)ను గుర్తెరగని ఈ ప్రాంత పాలకు నాయకులు లేరనే చెప్పవచ్చు గ్రామంలో ఏ అభివృద్ధి పనులు కావాలన్నా పట్టువదలని విక్రమార్కుడిలా ఆయన అంత్యక్రియలు మంగళవారం ఉదయం నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

కవి అందెశ్రీకి నివాళి



ఆర్మూర్‌లో అందెశ్రీ కి నివాళులు అర్పిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ఆర్మూర్ టౌన్ , నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బార్ అసోసియేషన్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ కి సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అందెశ్రీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా బార్ అసోసియేషన్ సభ్యులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి జెస్సు అనిల్ పాల్గొన్నారు.

బోధన్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం అమరవీరుల స్థూపం వద్ద బోధన్ జేఏసీ ఆధ్వర్యంలో అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ జేఏసీ కన్వీనర్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో 1519 రోజులు నిరాహార దీక్షలు చేసినప్పుడు బోధన్ దీక్షలకు వచ్చి పోరాటానికి స్ఫూర్తిని ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి బి.మల్లేష్, జేఏసీ నాయకులు న్యాయవాది శ్యామ్‌రావు, సాయిబాబా గౌడ్, సుధాకర్ చారి,న్యాయవాది హన్మంత్ రావు, విద్యాసాగర్, సీతారాం, షేక్ ఖాజా, అమ్జాద్ ఖాన్, షేక్ నజీర్, ఈర్షద్, తాళ్ల రాములు తదితరులున్నారు.

నవీపేట: రాష్ట్ర కవి, ఉద్యమకారుడు, సాహితీవేత్త అందెశ్రీ మృతి తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటు అని జన వికాస్ సేవ సంస్థ జిల్లా అధ్యక్షుడు తెడ్డు పోశెట్టి అన్నారు. నవీపేటలో మాట్లాడుతూ అందెశ్రీ మృతి తమను తీవ్రంగా కలిచి వేసిందని అన్నారు.

నందిపేట: మండల కేంద్రంలో అందెశ్రీ సంతాప సభను జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు నల్లబ్యాడ్జీలు ధరించి అందె శ్రీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కె. గంగాధర్, అబ్దుల్‌బారి, సిలెండర్ లింగం, బొడ్డు రాజశేఖర్, రమేష్, వీరేశం, దేవేందర్ ఉన్నారు.

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి స్థానిక ఉన్నత పాఠశాలలో జయజయహే తెలంగాణ జననిజయకేతం గేయంతో తెలంగాణ ఉద్యంలో ఉద్యమకారులను ఉర్రూతలుగించిన కవి తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ మృతికి శ్రీ సుధా సాహితి కళాసమితి సభ్యులు ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన అకాల మరణం తీరని లోటని ఉద్యమ జోహర్లు అర్పిస్తూ అందెశ్రీ కుటుంబసభ్యులకు ప్రగాడ సానుభూతి తెలియజేసి ఆయన ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సుధా సాహితి కళాసమితి అధ్యక్షుడు కవి, రచయిత ఉల్లేంగాల గంగాధర్, కార్యదర్శి మర్యాల నాగభూషణం, కోశాధికారి, కవి వేములవాడ జనార్ధన చారి, సభ్యులు గాయకుడు సాగర్, సైదు నర్సయ్య, చవుటి నర్సయ్య, ఆర్టీసీ బుచ్చయ్య, రావి పాల్గొన్నారు.

అందెశ్రీతో ఆత్మీయ అనుబంధం

ఆర్మూర్ టౌన్ , నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గీతం రచయిత, ప్రముఖ కవి అందెశ్రీతో ఆత్మీయత అనుబంధం ఉందని లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు పృథ్వీరాజ్ అన్నారు. అందెశ్రీ అకాల మరణం పొందడం తను లేడనే నిజాన్ని నమ్మలేకపోతున్నామని కొన్నేళ్లుగా తమ కుటుంబానికి ఆత్మీయత అను బంధం ఉందని ఆర్మూర్ ప్రాంతానికి వచ్చినెప్పుడెల్ల తన ఇంటి లోనే ఉండేవాడని గత ఏడాది ఆగస్టు నెలలో తన లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి హాజరయ్యాడని ఆయన తెలిపారు. ఆయన ఆత్మకు ఆ భగవంతుడు శాంతి కలిగించాలని వేడుకున్నారు.



బోధన్‌లో అందెశ్రీకి నివాళులు అర్పిస్తున్న దృశ్యం


నందిపేట్‌లో అందెశ్రీ సంతాప సభలో పాల్గొన్న జేఏసీ సభ్యులు


అందెశ్రీకి నివాళులర్పిస్తున్న సుధా సాహితి కళాసమితి సభ్యులు

బాన్సువాడకు చేరుకున్న పాదయాత్ర



శాంతి పాదయాత్ర చేపడుతున్న దృశ్యం

బాన్సువాడటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బిచ్కుంద నుంచి కామారెడ్డి వరకు తలపెట్టిన శాంతి పాదయాత్ర సోమవారం బాన్సువాడకు చేరుకుంది. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ.. ప్రపంచ శాంతి కోసం కామారెడ్డి జిల్లా కేంద్రం వరకు పాదయాత్ర చేపట్టినట్లు వారు తెలిపారు. అందరూ సంఘటితంగా ఉంటే సమస్యలు లేని రాజ్యం నెలకొల్ప వచ్చన్నారు. పాదయాత్రలో ఏ.ఎం.సింగ్, ఆమోస్, సత్యం, ఏసుదాస్, అమృత్‌రాజ్, డేవిడ్ తదితరులున్నారు.

నూతన ఎంపీడీవోకు సన్మానం



ఎంపీడీవోను సన్మానిస్తున్న మండల ఎంఆర్పీఎస్ నాయకులు

పెద్ద కొడప్‌గల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెద్ద కొడప్‌గల్ మండల ఎంపీడీవోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బీఆర్ అభినవ్ చందర్‌తో పాటు ఎంపీవో లక్ష్మీకాంత్ రెడ్డిని సోమవారం మండల ఎంఆర్పీఎస్ నాయకులు సన్మానించారు. గతంలో మండల ఇంచార్జి ఎంపీడీవోగా లక్ష్మీకాంత్ రెడ్డి పనిచేయగా, ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-2 ఫలితాల్లో నిజామాబాద్‌కు చెందిన అభినవ్ చందర్ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడు సర్వగల్ల రవీందర్ మాట్లాడుతూ.. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు సేవచేయాలని ఆకాంక్షించారు. మండల ఎంఆర్పీఎస్ నాయకులు జయ బలరాం, మారతి, మొగులయ్య, సాయిలు, అంబ య్య పాల్గొన్నారు.

కబ్జాకు గురైన భూమిని కాపాడాలి



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఆర్మూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడి అర్హులైన పేదలకు అందజేసి ఇందిరమ్మ పథకంలో ఇల్లు నిర్మించి ఇవ్వాలని సీపీ ఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి ఎస్.దాసు అన్నారు. ఆర్మూర్ మునిసిపల్ పరిధి పెర్కిట్‌లోని సర్వే నంబర్ 202-3 లోని ప్రభుత్వ భూమిని కబ్జాచేసి ఇల్లు నిర్మిస్తున్నారని ఆ భూమిని ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరుతూ ఆర్మూర్ సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం సీపీఐఎం ఎల్ న్యూడెమో క్రసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిలో ప్రైవేట్ వ్యక్తి నిర్మాణాలకు అనుమతి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆర్మూర్ సబ్ డివిజన్ కమిటి కార్యదర్శి సూర్య శివాజీ, బాలయ్య, దేవన్న, అబ్దుల్, మర్క్స్, వెంకటేష్, ప్రిన్స్, బాబురావు, నరేందర్, హుస్సేన్, రాహుల్, సూరిబాబు, వర్ధారెడ్డి, పోశెట్టి, భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో నడవాలి

- ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి



విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం

కోటగిరి, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని ఎంచుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర వ్యవసాయ సలహదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కోటగిరి మండలం లింగాపూర్ పరిధిలో గల అడ్కేస్ లింగమయ్య ఆలయంలో సోమవారం విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం కనులపండువగా సాగింది. ఎమ్మెల్యే పోచారం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూ.3.50 కోట్ల వ్యయంతో ఆలయ నిర్మాణానికి ముందుకువచ్చిన ముమ్మలనేని రాజశేఖర్‌ను అభినందించారు. 3 రోజుల పాటు ఆలయంలో వివిధ కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం మాట్లాడుతూ.. పంచ లింగాల్లో ఒక్కటైన అడ్కేస్ లింగమయ్య ఆలయ పునఃనిర్మాణం అద్భుతంగా ఉందన్నారు. అనంతరం ఆలయంలో ఎమ్మెల్యే పోచారంను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు కొనసాగాయి. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హన్మంతు, నాయకులు శ్రీధర్, కృష్ణారెడ్డి, విఠల్, నాగేందర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆగిన పనులు.. తీరని సమస్యలు

- భిక్కనూరు- రామేశ్వర్‌పల్లి రోడ్డు పనుల్లో జాప్యం
- ప్రయాణంలో వాహనదారులకు తీవ్ర ఇక్కట్లు
- త్వరగా పూర్తిచేయాలని వేడుకోలు

భిక్కనూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలకేంద్రం నుంచి రాజంపేట మండలకేంద్రం వరకు రామేశ్వర్‌పల్లి, తిప్పాపూర్, మోటాట్‌పల్లి, తలమడ్ల గ్రామాల మీదుగా చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో ఇబ్బందులు లేనిచోట పనులు పూర్తిచేయగా కొన్నిచోట్ల చెట్లు, వర్షాలకు కంకర కొట్టుకుపోవడం, కాంట్రాక్టర్‌కు డబ్బుల చెల్లింపుల జాప్యం తదితర కారణాలతో పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. నిత్యం రోడ్డుపై వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో పనులు ఆలస్యం అవడంతో గుంతలు, కంకర తేలిన రోడ్లపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల పలుచోట్ల గుంతల్లో స్థానిక కాంగ్రెస్ నాయకులు మట్టి పోసి పూడ్చినప్పటికీ వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. అసలే చలికాలం కావడంతో వాహనాల కారణంగా రోడ్డుపై వస్తున్న దుమ్ముతో చర్మం పగలడం ,అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రహదారిపై ఏర్పడిన గుంత

పనులను మధ్యలో వదిలేసి..

భిక్కనూరు నుండి రాజంపేట మండలకేంద్రం వరకు నిర్మిస్తున్న ఈ బీటీ రోడ్డుకు ప్రభుత్వం రూ.18కోట్లు మంజూరు చేసింది. దీంతో పాతరోడ్డు తొలగించి అవసరమైన చోట నూతన బ్రిడ్జిలు, అనుకూలంగా ఉన్న చోట బీటీరోడ్డు పనులు పూర్తిచేశారు. 50శాతం పనులు పూర్తవగా చాలాచోట్ల కంకర వేసి వదిలేశారు. కాంట్రాక్టర్‌కు రోడ్డు నిర్మాణానికి సంబంధించి డబ్బుల చెల్లింపులో జాప్యం జరగడంతోనే పనులు ఆగినట్లు సమాచారం.

పనులను త్వరగా పూర్తిచేయాలి

భిక్కనూరులోని పాత జాతీయరహదారి నుంచి రామేశ్వర్‌పల్లి వరకు రోడ్డు నిర్మాణపనులు నిలిచిపోవడంతో రోడ్డు అధ్వానంగా తయారైంది. నిత్యం వాహనాలతో, స్థానికులతో రద్దీగా ఉండే ఈ రోడ్డుపై కంకర తేలి, గుంతలు ఏర్పడి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పూర్తిచేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదని, ఈ రోడ్డు నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామని, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని రామేశ్వర్‌పల్లి గ్రామస్థులు వేడుకుంటున్నారు.



కంకర తేలి అధ్వానంగా ఉన్న రహదారి

త్వరలోనే పనులు ప్రారంభం

రెండు, మూడు రోజుల్లో భిక్కనూరు నుంచి రామేశ్వర్‌పల్లి వరకు పనులు ప్రారంభిస్తాం. ప్రస్తుతం 50 శాతం వరకు పనులు పూర్తయ్యాయి. వచ్చే మార్చి, ఏప్రిల్ లోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- రవితేజ, ఆర్అండ్‌బీ ఏఈ, భిక్కనూరు

రోడ్లు నిర్మించండి

బీర్కూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని వైఎస్ఆర్ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని కాలనీవాసులు ఎంపీడీవో శ్రీనిధికి విన్నవించారు. 14 ఏళ్ల క్రితం కాలనీ ఏర్పడిందన్నారు. ఇప్పటి వరకు కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించలేదన్నారు. మురుగు అంతా రోడ్లపై ప్రవహిస్తుందన్నారు. దీంతో రోడ్లపై తిరగలేకపోతున్నామని తెలిపారు. దోమలు, ఈగలు, విషకీటకాలు వృద్ధి చెందుతున్నాయని, దుర్వాసన వెదజల్లుతుందన్నారు. వెంటనే స్పందించి కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని వారు ఎంపీడీవోను కోరారు.

డెస్కు బెంచీలు అందించాలి

నసురుల్లాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెమ్లి ప్రాథమిక పాఠశాలకు డెస్క్ బెంచీలు అందించాలని సోమవారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి విద్యార్థిసంఘ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ (ఎస్)-టీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్, మావురం శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యాసంవత్సరం ప్రారంభమైన జూన్ నుంచి ఇప్పటివరకు పాఠశాలలో విద్యార్థులకు డెస్క్ బెంచీలు లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పాఠశాలలో దాదాపు 90 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. నాయకులు విఘ్నేష్, రాజు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడమే లక్ష్యం



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే

మద్నూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. సోమవారం మద్నూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఓ ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారురాలు గుడాల్వర్ సవితను శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లు వాస్తవరూపం దాలుస్తున్నాయన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జుక్కల్ నియోజకవర్గానికి ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కూడా మంజూరు కాలేదని గుర్తు చేశారు. ఇప్పుడు మన జుక్కల్ నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని, కొన్ని నిర్మాణాలు పూర్తి చేసుకొని గృహప్రవేశం జరుగుతుండగా మరికొన్ని వివిధ నిర్మాణ దశల్లో ఉన్నట్లు తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇళ్లు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఇళ్ల నిర్మాణాల్లో కృషిచేస్తున్న ప్రభుత్వ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు సాయిలు, నాయకులు హనుమాండ్లు స్వామి పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలి



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

బాన్సువాడటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మినీ స్టేడియంలో ఆయన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో మెలగాలన్నారు. బాన్సువాడ నుం చి 14 సార్లు జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనడం ఆనందకరమని, క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు.బాన్సువాడలో గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు స్టేడియం నిర్మాణం చేపట్టామన్నారు. స్టేడియంలో కబడ్డీ మ్యాట్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మల్లేశ్‌గౌడ్, ఎంఈవో నాగేశ్వరరావు, మాజీ మునిసిపల్ చైర్మన్ జంగం గంగాధర్, సొసైటీ చైర్మన్ ఎర్వల కృష్ణారెడ్డి, ఏజాస్, గోపాల్‌రెడ్డి, నార్ల సురేష్, నార్ల రవీందర్, చిన్నా, ఖాలేక్, నాయకులు, విద్యార్థులు

అందెశ్రీ మృతి పట్ల పోచారం దిగ్భ్రాంతి

ప్రజాకవి అందెశ్రీ మరణవార్త విన్న రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలిసి మినీ స్టేడియంలో 2 నిమిషాల పాటు మౌనం పాటించారు. పోచారం మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో పాటల ద్వారా ప్రజలలో చైతన్యం కలిగించిన కవి అని గుర్తుచేశారు. అందెశ్రీ కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

భళా.. పూర్వ విద్యార్థి

59 మంది పరీక్ష ఫీజు చెల్లించిన నారాయణ



చెక్కును అందజేస్తున్న పూర్వవిద్యార్థి

నందిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లోని 59 మంది పదోతరగతి విద్యార్థులకు ఓ పూర్వ విద్యార్థి పరీక్షఫీజు మొత్తాన్ని చెల్లించారు. మండల కేంద్రానికి చెందిన పూర్వవిద్యార్థి బుక నారాయణ 59 మంది విద్యార్థులకు రూ.11వేల పరీక్ష ఫీజును చెల్లించాడు. ఈ మేరకు ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి అందజేశారు. ఇప్పటి వరకు పాఠశాలకు చేస్తున్న అభివృద్ధే కాకుండా భవిష్యతులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని నారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

గృహలక్ష్మి పథకం డబ్బులు అందించండి



బీర్కూర్‌లో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బీర్కూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం హయాంలో గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు నిర్మించుకున్నామని, వాటికి సంబంధించిన డబ్బులు ఇప్పించాలని కోరుతూ పలువురు లబ్ధిదారులు ఎంపీడీవో శ్రీనిధికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం వినతిపత్రం అందించారు. గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు నిర్మించుకున్న వారికి రూ.3లక్షల ఆర్థికసాయం అందజేస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. దీంతో తామంతా అప్పులు చేసి మరీ ఇళ్లు నిర్మించుకోగా ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి నగదు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సాయాన్ని వెంటనే అందించేలా చూడాలని కోరారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న విండో చైర్మన్ శపథంరెడ్డి

పిట్లం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ప్రభుత్వం ఏర్పాటుచేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సహకార సంఘం చైర్మన్ శపథం రెడ్డి అన్నారు. సోమవారం ఏఎంసీ కార్యాలయంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతుల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి సంతోష్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.


జుక్కల్ రైతులకు నోటీసులు



రైతులతో మాట్లాడుతున్న ఎస్సై నవీన్

జుక్కల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండల వ్యాప్తంగా ఉన్న రైతులు రహదారులపై వరి ధాన్యం ఆరబెట్టవద్దని జుక్కల్ ఎస్సై నవీన్ చంద్ర తెలిపారు. ఈ మేరకు సోమవారం జుక్కల్ మండలంలోని బస్వాపూర్ గ్రామం వద్ద రోడ్డుపై వరి ధాన్యం ఆరబెట్టిన రైతులకు నోటీసులు అందించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడారు. రహదారులపై ధాన్యం ఆరబెట్టడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని తెలిపారు. ప్రమాదాలు నివారించడానికి అన్నదాతలు సహకరించాలని కోరారు. ప్రధానంగా రాత్రివేళల్లో ధాన్యం కనిపించక ఎంతో మంది వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఎంతటి రైతులైనా రోడ్డుపై వరి ధాన్యం మారబెడితే ప్రభుత్వ నిబంధనల మేరకు కేసులు నమోదు చేస్తామని ఆయన అన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



శివ పార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

భీమ్‌గల్ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోన్‌గొప్పులలోని శ్రీ హరిహర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆలయంలో శివపార్వతులు శ్రీదేవి, భూదేవి విష్ణుమూర్తి ఒకే చోట కొలువై నిత్య పూజలు అందుకుంటున్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. సోమవారం సామూహిక హోమం, శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామికి, శివపార్వతులకు అభిషేకం, శివపార్వతుల కళ్యాణం కనులపండువగా నిర్వహించారు. భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ, కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి లక్ష్మారెడ్డి, ట్రస్టు సభ్యులు, ఆలయ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా మార్చాలి

బోధన్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా మార్చాలని జీవో నంబర్ 34ను అమలుచేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో సోమవారం బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులు రమేష్ బాబు మాట్లాడుతూ.. 2022 డిసెంబర్ 2న మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి వికలాంగుల సంక్షేమ శాఖను వేరుచేస్తూ విడుదల చేసిన జీవోనువెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జీవో ఇచ్చి మూడేళ్ల అవుతున్నా అమలుకావడం లేదన్నారు. వికలాంగుల సంక్షేమం కోసం, నిర్వహణ కోసం అసిస్టెంట్ డైరెక్టర్‌ను జిల్లాస్థాయిలో తిరిగి నియమించాలని కోరారు. గతంలో వికలాంగుల సంక్షేమ శాఖను మహిళా శిశు సంక్షేమ శాఖలో విలీనం చేయగా, తాజాగా వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించాలని విడుదల చేసిన ఉత్తర్వులను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. జిల్లాస్థాయిలో వికలాంగులకు సమర్థవంతమైన సేవలు అందించడానికి ఈ విభజన జరగాలని కోరారు. జీవో అమలుకాకపోవడం వల్ల వికలాంగుల సంక్షేమానికి చర్యలు తీసుకోవడంలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. నాయకులు గంగాధర్, షేక్ నసీర్, రామ్ పటేల్, జనార్ధన్, గంగాధర్, ఎల్లయ్య, నాగనాథ్ పటేల్, లక్ష్మణ్, రాజు, జగదీష్, పాల్గొన్నారు.



యథేచ్ఛగా గుట్టను తవ్వేసిన అక్రమార్కులు

గుట్ట నక్కలు..

(5వ పేజీ తరువాయి)

భాగస్వామ్యం ఉందని చెబుతుండడంతో అధికారులు సైతం చర్యలకు వెనకాడుతున్నారు. గ్రామస్థులు, పక్కన ఉండే పొలాలవారు అభ్యంతరం తెలిపినా అధికారులు చర్యలు తీసుకోలేదు. ఇటీవల ఎడపల్లి పోలీసులు మొరం టిప్పర్‌లను పట్టుకోగా స్థానిక ప్రజాప్రతినిధి ఫోన్‌చేసి వాటిని విడిపించినట్లు ప్రచారం జరుగుతోంది. అభివృద్ధి పనుల పేరుతో రోజుకు 150 ట్రిప్పుల చొప్పున మొరం తరలిపోతోంది. అధికారు లు పట్టించుకోక పోవడంతో సర్కారుకు వచ్చే ఆదాయానికి చిల్లు పడుతోంది.

అనుమతి 20ట్రిప్పులకు, తీసేది 150 ట్రిప్పులు..

అభివృద్ధి పనుల పేరుతో రోజుకు 20 ట్రిప్పుల టిప్పర్‌లకు మొరం తవ్వుకునేందుకు రెవెన్యూ అధికారులు అనుమతులు ఇచ్చారు. కానీ రోజుకు ఏకంగా 150కి పైగా ట్రిప్పులు మొరం నిజామాబాద్ నగరంతో పాటు బోధన్, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మట్టి దందాలో నిర్వాహకుడు రోజుకు రూ.2లక్షలపైనే దండుకుంటున్నాడు. పక్కన వ్యవసాయ భూములకు కాల్వగట్టు ఉన్న వాటిని సైతం పూర్తిగా తవ్వేస్తున్నారు. గుట్టకు ఒకవైపు పూర్తికాగా ప్రస్తుతం మరో వైపు మొరం తవ్వుతున్నారు.

ప్రమాదకరంగా గుంతలు..

15ఫీట్ల లోతు వరకు మొరం తవ్వకాలు జరుగుతుండగా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. వర్షాకాలం నీళ్లతో ఆ గుంతలు నిండి ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఆ ప్రాంతంలో 300 పైన ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలో టీజీఐఐసీ (తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్)కు కేటాయించారు. అక్కడ రోడ్లు సైతం వేశారు. కానీ ఇప్పుడు ఆ ప్రాంతంలో అక్రమంగా మొరం తవ్వకాలు జరుగుతుండడంతో ఆ ప్రాంతం పూర్తిగా ఆనవాళ్లను కోల్పోయింది.

గనుల శాఖలో 'ఘనుడు'..

జిల్లాలో గనులశాఖ ద్వారా కేవలం నాలుగు క్వారీలకే అనుమతులు ఉన్నాయి. అయితే సదరు శాఖ పట్టించుకోకపోవడంతో అనేక ప్రాంతాలలో అక్రమ మొరం దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. మాక్లూర్, మోపాల్, ఎడపల్లి, ఆర్మూర్‌తో పాటు మల్లారంలో అక్రమంగా మొరం తవ్వుతున్నారు. ఇది వరకు గనులశాఖ ఏడీగా ఉన్న అధికారికి ఇటీవలే డీడీగా ఉద్యోగోన్నతి రావడంతో ఆ అధికారి పరిధి పెరిగి వసూళ్లపై దృష్టి పెట్టినట్లు విమర్శలు ఉన్నాయి. త్వరలోనే తనకు రాష్ట్రస్థాయి అధికారి పదవి వస్తుందని చెబుతూ జిల్లా వ్యాప్తంగా క్వారీలు, మొరం తవ్వకందారుల నుంచి రూ.లక్షల్లో వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏడీశాఖ కార్యాలయం కలెక్టరేట్‌లో ఉండగా డీడీశాఖ కార్యాలయం సుభాష్‌నగర్‌లో ఉంది. డీడీ పదోన్నతి పొంది ప్రస్తుతం ఇన్‌చార్జి ఏడీగా ఉన్న సదరు అధికారి ఏడీ కార్యాలయానికే రావడంలేదు. దీంతో కార్యాలయంలో ఇష్టారాజ్యంగా సిబ్బంది పనిచేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ అక్రమ మొరం దందాపై దృష్టిపెట్టి పర్యావరణాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమాల ఊబిలో తెలంగాణ వర్సిటీ



చెవులో పువ్వులతో నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘ నాయకులు

- సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి
- ఏఐపీఎస్‌యూ జిల్లా కార్యదర్శి అనిల్

ఇందూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయంలోని అడ్మిన్ బిల్డింగ్ వద్ద చెవుల్లో పూలతో ఏఐపీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి బోడ అనిల్ మాట్లాడారు. టీయూలో అక్రమ నియామకాలపై ప్రభుత్వం నేరుగా ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2009, 2012 సంవత్సరాలలో నియామకాలపై అనేక ఆరోపణలు ఉన్నాయని అన్నారు. నియామకాలను రద్దు చేస్తూ కోర్టు తీర్పు ఇచ్చినా వీసీ, రిజిస్ట్రార్ ఎందుకు పెడచెవిన పెడుతున్నారని ప్రశ్నించారు. అనేక ఆరోపణలు ఉన్న వ్యక్తి రిజిస్ట్రార్‌గా ఎందుకు కొనసాగనిస్తున్నారని, దీనిపై అనేక అనుమానాలు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ యునివర్సిటీ కన్వీనర్ సంజీవ్, ఏఐపీఎస్‌యూ యూనివర్సిటీ కన్వీనర్ వినీత్, జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్ సింగ్ ఠాకూర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కుశాల్, యూనివర్సిటీ కన్వీనర్ సంజయ్, సందీప్ సునీల్, శివ, తపన్, రోహన్, రాజు వీరు పాల్గొన్నారు

తీర్పు ఇచ్చినా.. తీరు మారదా?

(5వ పేజీ తరువాయి)

అధికార పార్టీ నేతల దృష్టికి కొంతమంది విద్యార్థి సంఘాల నాయకులు అక్రమ నియామకాలపై కోర్టు ఉత్తర్వుల విషయాన్ని తీసుకెళ్లారు. కాగా, గురువారం జిల్లాకు ఇంచార్జ్ మంత్రితో పాటు ఇతర ప్రజాప్రతినిధులు రానున్న నేపథ్యంలో ఈ అంశంపై చర్చించే అవకాశం ఉంది. నియామకాలు జరిగి 13ఏళ్లు గడుస్తున్నా కోర్టు తీర్పు ప్రతికూలంగా రాగా ఇంకా అక్రమ నియామకాలు పొందిన వారికి పదోన్నతులు కల్పించేందుకు అధికారులు ప్రయత్నా లు చేయడం యూనివర్సిటీ ప్రతిష్టను దిగజార్చేలా ఉందని ప్రజాప్రతినిధులు ఈ అంశంపై సీరియస్‌గా ఉన్నారు.

ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

- రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి



బండారుపల్లిలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

బోధన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల ద్వారా పంట ఉత్పత్తుల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. బోధన్ మండలం బండార్‌పల్లెలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని కల్దుర్కిలో ధాన్యం కేంద్రాలను కలెక్టర్ సోమవారం సందర్శించారు. సోయాబీన్ సేకరణ కేంద్రంలో రైతుల నుంచి సేకరించిన సోయాబీన్ నిల్వల నాణ్యతను పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ప్రాంతాలల్లో సోయాబీన్, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి కేంద్రంలో సరిపడా గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని, రవాణా పరమైన ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. అనంతరం కల్దుర్కి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైస్ మిల్లులకు ఎన్ని లోడ్‌ల లారీలు వెళ్లాయి, ట్రక్ షీట్లు తెప్పించుకుని ట్యాబ్ ఎంట్రీలు చేస్తున్నారా అని ఆరా తీశారు. 17శాతానికి లోబడి తేమ ఉన్న ధాన్యాన్ని రైతులు కేంద్రాలకు తెచ్చిన వెంటనే తూకం జరిపించాలన్నారు. కలెక్టర్ వెంట ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ సందీప్, మార్క్‌ఫెడ్ డీఎం మహేష్, తహసీల్దార్ విఠల్, కేంద్రాల నిర్వాహకులు ఉన్నారు.

ధాన్యాగారం..

(5వ పేజీ తరువాయి)

ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం కాగా, 717 కేంద్రాలను నెలకొల్పి ఇప్పటికే 50శాతం వరకు సేకరణ పూర్తి చేశామని తెలిపారు. మరో వారం రోజుల్లో సింహభాగం వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తవుతాయని అన్నారు. సేకరించిన వరి ధాన్యంలో సన్న రకం ధాన్యం 3.21 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, దొడ్డు రకం ధాన్యం 25.9 వేల మెట్రిక్ టన్నులు మాత్రమేనని వివరించారు. సేకరించిన ధాన్యానికి సంబంధించి 34,328 మంది రైతులకు వారి ఖాతాలలో రూ. 549.85 కోట్ల బిల్లుల చెల్లింపులు పూర్తయ్యాయని కలెక్టర్ తెలిపారు. సోమవారం ఒక్క రోజే రూ. 105 కోట్ల బిల్లులు రైతులకు చెల్లించామన్నారు. జిల్లాలో మొక్కజొన్న, సోయాబీన్ కొనుగోలు కేంద్రాలను కూడా రైతుల సౌకర్యార్థం అవసరమైన చోట ఏర్పాటు చేసి పంట ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే 17వేల మెట్రిక్ టన్నుల వరకు మొక్కజొన్న కొనుగోలు జరిగిందని, 25వేల మెట్రిక్ టన్నుల వరకు మొక్కజొన్న సేకరణ జరుగుతుందని తెలిపారు. మొక్కజొన్న పంట ఎకరాకు 18.5 క్వింటాళ్ల నుంచి 25 క్వింటాళ్ల వరకు కొనుగోలు పరిమితిని పెంచాలని తాను కోరిన ప్రతిపాదనను అనుమతించడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరిందని అన్నారు. సోయాబీన్ సేకరణ కోసం ఈ పంట సాగు జరిగిన ప్రాంతాల్లో 10 కొనుగోలు కేంద్రాలను నెలకొల్పి సోయాబీన్ సేకరణ జరుపుతున్నామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, డీఎస్‌వో అరవింద్ రెడ్డి, సివిల్ సప్లయిస్ డీఎం శ్రీకాంత్ రెడ్డి, డీసీవో శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ డీఎం మహేష్, మార్కెటింగ్ శాఖ ఏడీ గంగుబాయి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కుల పంపిణీ చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో అనారోగ్యంతో బాధపడి చికిత్స పొందిన బాధితులకు సీఎం సహాయనిధి ద్వారా లబ్ధిపొందిన లబ్ధిదారులకు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త చెక్కులను అందజేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో 100 మంది లబ్ధిదారులకు 26లక్షల 49వేల రూపాయల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో ఆర్థికంగా ఇబ్బంది పడుతూ వైద్యం పొందలేని పరిస్థితుల్లో ఉంటే ఈ పథకం ద్వారా ఆదుకోవడం బాధ్యతగా భావిస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సహాయం అందేలా ప్రయత్నిస్తానని అన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు న్యాలంరాజు, శ్రీధర్, శంకర్, కృష్ణ, రాఘవేంద్ర, కిశోర్, మటం పవన్, ఆనంద్ పాల్గొన్నారు.

సుదర్శన్‌రెడ్డిని సన్మానించిన సిరికొండ కాంగ్రెస్ నాయకులు



సుదర్శన్‌రెడిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరికొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సలహాదారునిగా నియమించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని సిరికొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాకారం రవి, డీసీసీ కార్యదర్శి గొల్ల ఎర్రన్న సోమవారం సన్మానించారు. సుదర్శన్‌రెడ్డిని బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సలహాదారుగా జిల్లా, రాష్ట్ర అభివృద్ధి విషయంలో ప్రభుత్వానికి మంచి సలహాలు, సూచనలు అందించి రాష్ట్రాభివృద్ధి కృషి చేయాలని మండల కాంగ్రెస్ నాయకులు కోరారు.

వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ పద్ధతిన వివిధ పోస్టుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ టీ.వినయ్‌కృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని తెలిపారు. దరఖాస్తు పత్రాన్ని ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మెడికల్ ఆఫీసర్స్ ఎంబీబీఎస్, మెడికల్ ఆఫీసర్స్ ఆ యు ర్వేదం, స్టాఫ్ నర్స్, జీఎన్ఎం పోస్టుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

బదిలీ అయిన న్యాయాధికారులకు వీడ్కోలు

నిజామాబాద్ లీగల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు నుంచి బదిలీ అయిన న్యాయాధికారులు ఆశాలత, ఉదయ్ భాస్కర్‌రావుకు జిల్లా బార్ అసోసి యేషన్ సోమవారం ఘనంగా వీడ్కోలు పలికింది. జిల్లాకోర్టు ప్రాంగణంలోని బార్ సమావేశపు హాల్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయాధికారి జీవీఎన్ భరతలక్ష్మి ముఖ్యఅతిథి గా పాల్గొని ప్రసంగించారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిళ్ల సాయరెడ్డి, ప్రధాన కార్యదర్శి మాణిక్ రాజు, ఉపాధ్యక్షుడు సురేష్, తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్ రెడ్డి బదిలీపై వెళుతున్న న్యాయాధికారులకు మెమెంటో, శాలువతో సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయాధికారి హరీష, సీనియర్ సివిల్ జడ్జి సాయిసుధ, జూనియర్ సివిల్ జడ్జిలు గోపీకృష్ణ, ఖుష్బూ ఉపాధ్యాయ, శ్రీనివాస్ రావు, హరి కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.రాజేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ న్యాయవాది ఆమీదాల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు

ఎకరాకు రూ.50వేల పరిహారం అందించాలి

నవీపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో మండలంలోని వివిధ గ్రామాలలో దెబ్బతిన్న వరిపంటకు ఎకరాకు 50వేల రూపాయల చొప్పున పరిహారం అందించాలని సోమవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి తమ వినతిపత్రాన్ని అందజేశారు. గోదావరి వరదలతో మండలంలోని కోస్లీ, మిట్టాపూర్, యంచ, అల్జాపూర్, నందిగామ, బినోల, నిజాంపూర్, తుంగిని, నాళేశ్వర్ గ్రామాలలో సుమారు 3వేల ఎకరాలలో పంట నష్టం జరిగిందని వారు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం అందిస్తామని రాష్ట్రమంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు హామీ ఇచ్చారని అదే విధంగా బోధన్, రెంజల్, నవీపేట మండలాలలో వరదలతో దెబ్బతిన్న పంటలకు ఎకరాకు 50వేల రూపాయల పరిహారం అందించాలని కోరారు.

ఇందూరు నుంచే అందెశ్రీ సాహితీ యాత్ర

- జిల్లాతో అందెశ్రీకి ప్రత్యేక అనుబంధం
- తాపీ మేస్త్రీతో ప్రారంభమైన జీవితం
- అశు కవిత్వం చెప్పడంలో ప్రత్యేక గుర్తింపు



నిజామాబాద్ కల్చరల్ - పాఠశాలలో సన్మానం అందుకుంటున్న అందెశ్రీ (ఫైల్)

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇందూరు జిల్లాలోని మాక్లూర్ మండలం అమ్రాద్‌లోగల శృంగేరి మఠానికి చెందిన స్వామి శంకర్ మహరాజ్ అందించిన ప్రోత్సాహంతో అందెశ్రీ సాహితీయాత్ర ప్రారంభమైంది. అందెశ్రీ తాపీ మేస్త్రీతో ప్రారంభమైన జీవితం సాహిత్య రంగంలోకి శృంగేరి మఠం అందించిన ప్రోత్సామంతో అడుగుపెట్టి ఆశు కవిత్వం చెప్పడంలో ప్రత్యేకంగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ ప్రాంతంలోనే కొంత కాలం ఉండి పనిచేసుకున్నారు. ఆర్.నారాయణ మూర్తి ద్వారా విప్లవాత్మక సినిమాలకు పాటలు రాస్తూ గేయ రచయితగా గుర్తింపు తెచ్చుకున్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో జయ జయహే తెలంగాణ గీతం ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేసి ఉద్యమం వైపునకు అడుగులు వేయించారు. ప్రజాకవి, ప్రకృతి కవిగా ప్రసిద్ధి అయిన అందెశ్రీ వరంగల్ జిల్లాలో జన్మించినప్పటికీ ఇందూరు జిల్లా తనకు బతుకుదెరువు ఇచ్చిందని అనేక సార్లు గుర్తు చేశారు. మళ్లీ జన్మ ఉంటే ఇందూరులో పుట్టి రుణం తీర్చుకుంటానని అనేవారు. ఈ ప్రాంతంలో అధికంగా ఉండే జోగిని వ్యవస్థపై రాసిన పాటను కథ సిద్ధం చేసి చిత్రీకరించిన గంగ సినిమాకు వచ్చిన నంది అవార్డులను జిల్లాకే అంకితం ఇచ్చారు.

జిల్లాతో ప్రత్యేక అనుబంధం...

సాహిత్య రంగంలో అడుగుపెట్టినది మొదలుకొని పలు సందర్భాల్లో జిల్లా పర్యటనకు వచ్చిన అందెశ్రీ ప్రత్యేక అనుబంధాన్ని గుర్తు చేసేవారు. తన పాట మొదలైంది ఇక్కడి నుంచేనని ప్రతీ సభలో గుర్తు చేస్తూ జ్ఞాపకాలను పంచుకున్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రజలను చైతన్యవంతులను చేయడంలో నిర్వహించిన సభకు హాజరై తన పాటలతో అలరించారు. సాహితీవేత్తలతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంతో పాటు వివిధ సాహిత్య సమావేశాలు, పాఠశాల వార్షికోత్సవాలకు ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు.

రూరల్ ఎమ్మెల్యే ప్రగాఢ సానుభూతి

కవి అందెశ్రీ మృతికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రగాఢసానుభూతిని వ్యక్తం చేశారు. సాహిత్య రంగానికి ఆయన మృతి తీరనిలోటు అని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారని తెలంగాణ రాష్ట్రసాధనలో ఆయన రాసిన జయ జయహే గేయం కోట్లాది ప్రజల గొంతుకై నిలిచిందని గుర్తు చేశారు. జిల్లాలోని మాక్లూర్ మండలంలో కొంతకాలం గడపడం గొప్ప అనుభూతిని ఇచ్చిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటు అని ఆయన కుటుంబానికి ప్రగాఢసానుభూతిని వ్యక్తం చేశారు.

సీపీఐ నాయకుల నివాళి

కవి రచయిత తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ రచించిన అందెశ్రీకి సీపీఐ నాయకులు ఘన నివాళులర్పించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మౌనంపాటించి నివాళులర్పించారు.

రచయితల సంఘం నివాళులు

ప్రముఖ కవి, రచయిత డాక్టర్ అందెశ్రీ పార్థివదేహానికి తెలంగాణ రచయితల సంఘం ఘననివాళులర్పించింది.

ప్రజానాట్యమండలి ప్రతినిధులు

నగరంలోని పెన్షనర్ల భవన్‌లో ప్రజానాట్యమండలి ప్రతినిధులు అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. నీర్పలింగం, సాయిబాబా, రామ్మోహన్‌రావు, చంద్రశేఖర్, రాధాకిషన్, తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య రంగంలో కీలక పాత్ర

ప్రముఖ కవి డాక్టర్ అందెశ్రీ మృతి సాహిత్య రంగంలో తీరనిలోటు అని తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రేమ్‌లాల్ అన్నారు. అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి తెలంగాణ సామాజిక రచయితల సంఘం నివాళులర్పించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ గేయ రూపంలో రచించిన జయ జయహే తెలంగాణ ఉద్యమ భావజాలాన్ని తెలంగాణ ప్రజల్లో చిరస్థాయిగా ఉంటుందని అన్నారు.

వరి కోత మిషన్ల ధరల దోపిడీ

(5వ పేజీ తరువాయి)

ఉండగా ఇప్పుడు మిషన్ రేట్లతో మళ్లీ ఆందోళన చెందుతున్నారు. అధిక ధరలు చెల్లించకపోతే పంట కోయడం సాధ్యం కాదని మిషన్‌దారులు చెబుతున్నారు. చేసేది లేక రైతులు తాము నష్టపోయినా అదనపు డబ్బు చెల్లిస్తున్నారు.

నష్టాల మీద నష్టాలు

తుఫాన్, వర్షాల కారణంగా పంట దిగుబడి తగ్గిపోయింది. రైతులు ఆశించిన ఫలితం రాకపోవడంతో ఆర్థికంగా బలహీనమయ్యారు. ఉన్న పంటను కోయడం కోసం చెల్లించాల్సిన అధిక రేట్లు వారికి మరింత భారమయ్యాయి. ఈ పరిస్థితుల్లో రైతులు వడ్డీపై డబ్బులు తెచ్చి మిషన్ ఖర్చు ముట్టజెప్పుతున్నారు.

ప్రభుత్వ జోక్యం కోరుతున్న రైతులు

కోత మిషన్‌ల రేట్లపై ప్రభుత్వం నియంత్రణ విధించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. మిషన్‌దారుల నిర్బంధ వసూళ్లను అరికట్టే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రజావాణికి 94 ఫిర్యాదులు

సుభాష్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ టీ.వినయ్‌కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. జిల్లాకేంద్రంలోని నూతన సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 94 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, జిల్లా పరిషత్ సీఈవో సాయాగౌడ్, నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ రవీంద్రసాగర్, హౌజింగ్ పీడీ పవన్‌కుమార్, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డిలకు అర్జీలను అందజేసి తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ ప్రజావాణికి 16..

సుభాష్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని పోలీసు కమిషనర్ సాయిచైతన్య అన్నారు. జిల్లాకేంద్రంలోని కమీషనరేట్ కార్యాలయంలో సోమవారం పోలీసు ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి 16 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను నేరుగా కమీషనర్ సాయిచైతన్యకు విన్నవించారు. ఈ సందర్భంగా అర్జీలను స్వీకరించి తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్‌లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని పరిష్కారానికి సూచనలు చేశారు. అనంతరం కమిషనర్ సాయిచైతన్య మాట్లాడుతూ పోలీసు సేవలను స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని చట్టప్రకారం పరిష్కరించుకుకోవాలన్నారు. పోలీసు ప్రజావాణి ద్వారా ప్రతి సోమవారం ఫిర్యాదుల సమస్యలను వెంట వెంటనే పరిష్కరిస్తున్నామని తెలిపారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

దర్పల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి అని ఎంఈవో రమేష్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్ ను నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లోనే ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసి 5-7 సంవత్సరాల విద్యార్థులతో పాటు 15-18 సంవత్సరాల లోపు విద్యార్థులకు ఆధార్‌ను అప్‌డేట్ చేస్తూ ఐరిస్ తీసుకుంటున్నారు. తప్పనిసరిగా విద్యార్థులు ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు.

రైలులో గుర్తు తెలియని వ్యక్తి హత్య

సుభాష్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న రైలులో గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. మహారాష్ట్రలోని అకోలా కాచీగూడ ఇంటర్‌సిటి ట్రైన్‌లో జరిగింది. నాందేడ్ జిల్లా ధర్మాబాద్ నుంచి నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో ఈ హత్య సంఘటన చోటుచేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తిని అతనితో ప్రయాణిస్తున్న వ్యక్తి కత్తితో పొడిచినట్లు తోటి ప్రయాణికులు తెలిపారు.

జీవితం మీద విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

మోస్రా,నవంబరు10(ఆంధ్రజ్యోతి): పోలీసులు తెలిపిన ప్రకారం గోవూర్ గ్రామానికి చెందిన ఏడుపుల ప్రశాంత్ తన భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో ప్రశాంత్ మద్యం తాగుడుకు బానిస అయి జీవితం మీద విరక్తి చెంది 06-11-2025 రోజు పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ నిన్న రాత్రి ఉస్మానియా ఆసుపత్రిలో మరణించినాడు. ఈ విషయంపై మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మహేష్ తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి మృతి

సిరికొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : తాటిచెట్టు పై నుంచి జారి పడి తాళ్లపల్లి నర్సాగౌడ్ అనే గీతాకార్మికుడు మరణించాడు.సహచర గీతా కార్మికులు చెప్పిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సిరికొండ మండలం గడ్కోల్ గ్రామ పరిధిలో సోమవారం ఉదయం తాటికల్లు తీయడానికి చెట్టు ఎక్కిన నర్సాగౌడ్ చెట్టుపై నుంచి జారి పడి చనిపోయాడు.

గాయపడిన సిబ్బందికి పరామర్శ

రోడ్డు ప్రమాదంలో గాయపడిన హోంగార్డు భూమయ్య, మహిళ కానిస్టేబుల్ మాధురిలను సీపీ సాయిచైతన్య పరామర్శించారు. సోమవారం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి ఆరోగ్యం గురించి డాక్టర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సినిమా గైడ్

దేవి	: జటాధర (9.30, 1.45, 6.00, 10.15)
విజయ్	: ది గర్ల్‌ఫ్రెండ్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్	: ప్రేమిస్తున్న (11.00, 6.00)
	: ప్రిడేటర్ బ్యాడ్‌ల్యాండ్ (2.00, 9.00)
లలితామహల్	: మాస్‌జాతర (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1	: ఆర్యన్ (11.00)
	: మాస్ జాతర (1.30, 7.30)
	: ది గర్ల్‌ఫ్రెండ్ (4.30, 10.30)
స్క్రీన్-2	: ది గ్రేట్ ప్రివెడ్డింగ్ షో (1.40, 4.30)
	: ది గర్ల్‌ఫ్రెండ్ (7.30) : జటాధర (10.30)
స్క్రీన్-3	: ప్రిడేటర్ బ్యాడ్‌ల్యాండ్స్ (ఇంగ్లీష్-3డి) (11.00)
	: ది గర్ల్‌ఫ్రెండ్ (1.30) : జటాధర (4.20)
	: బాహుబలి ది ఎపిక్ (6.50): ది గ్రేట్ ప్రివెడ్డింగ్ షో (10.40)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1	: ప్రిడేటర్ బ్యాడ్‌ల్యాండ్స్ (ఇంగ్లీష్-3డి) (11.00, 6.50)
	: ప్రిడేటర్ బ్యాడ్‌ల్యాండ్స్ (తెలుగు-3డి) (1.30)
	: ఆర్యన్ (4.00) : బాహుబలి ది ఎపిక్ (9.20)
స్క్రీన్-2	: జటాధర (10.50) : ది గర్ల్‌ఫ్రెండ్ (1.45, 4.40, 7.35, 10.30)
స్క్రీన్-3	: ఫోనెక్స్ అసాధ్యుడు (11.20) :కృష్ణలీల (1.55)
	: జటాధర (4.35, 7.30) :మాస్ జాతర (10.25)
స్క్రీన్-4	: డైస్ మిరాయ్ (11.05, 7.35) : ది గ్రేట్ ప్రివెడ్డింగ్ షో (1.45)
	: మాస్ జాతర (4.30) : ప్రేమిస్తున్న (10.20)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,23,800	రూ.1,13,500	రూ.1590

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.110	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	: రూ.120	రూ.230	రూ. 250

